సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

SK1 one NEWS HD

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 832 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | సోమవారం 22-06-2026

## 'నీట్'గా నో చెప్పిన అధికారులు



- ఒక్క నిమిషం ఆలస్యం
- నీట్ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన పలువురు విద్యార్థులు
- పరీక్షా కేంద్రానికి సమయానికి రాకపోవడంతో వెనక్కి పంపిన అధికారులు
- తీవ్ర నిరాశకు గురైన విద్యార్థులు, తల్లిదండ్రులు



## కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

- రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి
- అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి
- జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్ :**
హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ - మిగతా 2 లో

## నీట్ విద్యార్థులు ఉచిత బస్సు సౌకర్యం వినియోగించుకోవడం ఆనందంగా ఉంది

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రీ-నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం
- వేలాది మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని మంత్రి వెల్లడి
- ఇది విద్యార్థుల సంక్షేమానికి నిదర్శనమన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకున్న నిర్ణయమని ప్రశంస



**హైదరాబాద్ :**
జరిగిన రీ-నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు. నీట్ విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనలో వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా విద్యార్థుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



## సీఎం చంద్రబాబు రైతులకు క్షమాపణ చెప్పాలి

- షర్మిల డిమాండ్
- అన్నదాత సుఖీభవ పథకంపై ఏపీ ప్రభుత్వాన్ని విమర్శించిన వైఎస్ షర్మిల
- మూడో ఏడాదీ రైతులకు పాక్షికంగానే నిధులు విడుదల చేశారని ఆరోపణ
- 60 లక్షల మంది అర్హులుంటే 46 లక్షల మందికే సాయం అందిందని వ్యాఖ్య

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రైతులను వంచిస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అరకొర నిధులు విడుదల చేసి, వరుసగా మూడో ఏడాది కూడా రైతులకు అన్యాయం చేశారని ఆమె ఆరోపించారు. రాష్ట్ర - మిగతా 2 లో

# ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- యోగాపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన
- విజయవాడలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత యోగా మందిరాల ఏర్పాటు చేస్తామన్న సీఎం
- వచ్చే ఏడాది తిరుపతిలో యోగా దినోత్సవం నిర్వహిస్తామని ప్రకటన
- ఆధ్యాత్మికత, యోగాతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధ్యమన్న సీఎం



**అమరావతి :**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. యోగా గురువు రామ్‌దేవ్ బాబాతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ యోగాను చేరవేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో శాశ్వత యోగా మందిరాలను నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. యోగా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, 'యోగాంధ్ర' పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రామాణిక యోగా పద్ధతులను రూపొందించేందుకు నిపుణులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా 190 దేశాల్లో గుర్తింపు తీసుకువచ్చిన - మిగతా 2 లో

## అమరావతి మీదుగానే బుల్లెట్ రైలు




- పాత ప్రతిపాదనకే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు
- హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్‌లో పాత ప్రతిపాదనకే ప్రభుత్వం మొగ్గు
- కొత్త విమానాశ్రయం సమీపం నుంచి ఎలైన్‌మెంట్ ప్రతిపాదన వెనక్కి
- తిరుపతి-చిత్తూరు లింక్ కారిడార్ డీపీఆర్ తయారీకి అనుమతి

**అమరావతి :**
హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్‌లో పాత ప్రతిపాదనకే ఏపీ ప్రభుత్వం మొగ్గుచూపుతోంది. కొత్త విమానాశ్రయం సమీపం - మిగతా 2 లో

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!




- ముంబైలో విజృంభిస్తున్న కోవిడ్, స్వైన్ ఫ్లూ కేసులు
- రుతుపవనాల ఆలస్యంతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదల
- తీవ్ర జ్వరం, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు పోటెత్తుతున్న రోగులు
- యాంటీబయాటిక్స్ వాడొద్దని, జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

**ముంబై :**
రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ, ఇన్ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరం, - మిగతా 2 లో

## ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీ గంట సేపు వెయిటింగ్!

- నీట్ విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని వెయిటింగ్
- నీట్ విద్యార్థుల కోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోయిన ప్రధాని మోదీ
- ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం
- పరీక్ష ప్రారంభమయ్యాకే తన నివాసానికి బయలుదేరిన వైనం



**ఢిల్లీ :**
ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థుల పట్ల తనకున్న ప్రత్యేక శ్రద్ధను మరోసారి చాటుకున్నారు. నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ రాసే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో, ఆయన ఢిల్లీ విమానాశ్రయంలోనే దాదాపు గంటసేపు వేచి ఉన్నారు. ఈ సంఘటన ఆయన మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, ఆదివారం మధ్యాహ్నం 1:15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన నేరుగా తన అధికారిక నివాసానికి వెళ్లాల్సి ఉంది. అయితే, మధ్యాహ్నం 2 గంటలకు దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష ప్రారంభం కానుండటంతో, తన కాన్వాయ్ కారణంగా రోడ్లపై ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు ఇబ్బంది పడతారని ప్రధాని భావించారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ఆయన విమానాశ్రయం నుంచి బయటకు రాకుండా అక్కడే వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత, అంటే మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ఆయన తన నివాసానికి బయలుదేరారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు కట్టుదిట్టమైన భద్రత నడుమ నీట్ రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. - మిగతా 2 లో

## తమిళనాడులో ఘోర ప్రమాదం

- అమ్మోనియా వాయువు లీకై ఏడుగురి మృతి
- తమిళనాడు సీఫుడ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్
- 74 మందికి పైగా తీవ్ర అస్వస్థత, పలువురి పరిస్థితి విషమం
- యూనిట్‌లో వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం

**చెన్నై :**
తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో - మిగతా 2 లో



# సంపాదకీయం

## ఆంక్షల చట్రంలో సిరప్‌లు

ఎంతో జాప్యం జరిగాక భారత ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది. దగ్గుకు వాడే సిరప్‌లు ఇకపై వైద్యుల చీటి లేకుండా అమ్మరాదని ఔషధ దుకాణాలపై ఆంక్షలు తీసుకొస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 9నే వెలువడిన ఆ నోటిఫికేషన్ మంగళవారం వెలుగులోకొచ్చింది. విదేశాలతో పోలిస్తే మన వైద్య ఆరోగ్యరంగం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత చాలా ఎక్కువ. పట్టణాలు, నగరాల్లో ఈ సమస్య లేదు. గ్రామాల్లోనైనా, పట్టణాల్లోనైనా ఔషధ దుకాణాల కొరత మాత్రం ఉండదు. ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి ఔషధాలైనా విక్రయించే అలవాటు కూడా ఎక్కువే. ఈ వెసులుబాటు ఎంత వరకూ వచ్చిందంటే చిన్న చిన్న సమస్యలకు వైద్యుల్ని ఆశ్రయించటంకన్నా మందుల దుకాణంలో సమస్య చెబితే సరిపోతుందన్న అభిప్రాయం సామాన్య జనంలో స్థిరపడింది. పేదరికంవల్ల వైద్యుల దగ్గరకెళ్లే స్థోమత లేకపోవటం కూడా ఇందుకొక కారణం. విదేశాల్లో కేవలం కొన్ని రకాల విటమిన్ మాత్రలు, జలుబు మందులు మాత్రమే చీటి లేకుండా లభిస్తాయి. యాంటీ బయోటిక్స్, కొన్ని ఇతర ఔషధాలు కావాలంటే ప్రిస్క్రిప్షన్ ఉండాలి. అది కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయి ఉంటేనే విక్రయిస్తారు. ఇక దగ్గు మందు విషయానికొస్తే మనకు అంతర్జాతీయంగా చాలా చెడ్డపేరొచ్చింది. 2022లో పశ్చిమాఫ్రికా దేశమైన గాంబియాలో మన దేశంనుంచి దిగుమతైన దగ్గుమందు సేవించి 70 మంది చిన్నారులు మరణించారు. వీరిలో దాదాపు అందరూ మూత్ర పిండాలు పూర్తిగా దెబ్బతిన్నవారే. అదే సంవత్సరం ఉజ్బెకిస్తాన్‌లో కూడా ఈ కారణంగానే మరో 18 మంది పిల్లలు చనిపోయారు. అటుతర్వాత ఇండోనేసియా, మార్షల్ ఐలాండ్స్ వంటిచోట్ల భారతీయ దగ్గు మందుల నాణ్యతపై ప్రభుత్వాలు హెచ్చరికలు జారీచేశాయి. మన దేశంలోనూ సమస్యలు తలెత్తిన ఉదంతాలున్నాయి. నిరుడు అక్టో బర్‌లో మధ్యప్రదేశ్‌లో దగ్గుమందు వాడకంవల్లే 22 మంది పసిపిల్లలు ప్రాణాలు కోల్పో యారు. ఆ సిరప్‌లో డై ఇథిలీన్ గ్లైకాల్(డీఈజీ) అనే విషపూరిత పారిశ్రామిక ద్రావకం 45 శాతం ఉన్నట్టు తేలింది. వాస్తవానికి ఆ మందులో అనుమతించదగ్గ పరిమితి కేవలం 0.1 శాతం మాత్రమే. అంటే పరిమితికి మించి వందల రెట్లు ఎక్కువుందన్న మాట! మన ఔషధరంగ నియంత్రణ వ్యవస్థలు పకడ్బందీగా లేవన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. మార్కెట్ రీసెర్చ్ ఫ్యూచర్(ఎంఆర్‌ఎఫ్) నివేదిక ప్రకారం 2024లో దగ్గు మందుల మార్కెట్ విలువ దాదాపు 27 కోట్ల డాలర్లు కాగా, అది యేటా 9.9 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని అంచనా వేశారు. 2035 నాటికి ఇది మూడురెట్లు పెరుగుతుందని చెబుతున్నారు. కొత్త ఔషధాల తయారీ, దిగుమతులు, క్లినికల్ పరీక్షలు, ప్రమా ణాల రూపకల్పన కోసం మనకు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఉంది. దీనికింద ఆరు జోనల్ కార్యాలయాలు, సబ్ జోనల్ కార్యాల యాలు, వీటికి అనుబంధంగా డ్రగ్ టెస్టింగ్ లాబొరేటరీలు ఉన్నాయి. ఇవిగాక రాష్ట్రాల స్థాయిలో ఔషధ నియంత్రణలున్నాయి. ఇన్ని రకాల వ్యవస్థలు ఉన్నా నాసిరకం మందులు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఇవి వైద్యసలహా లేకుండానే దుకాణదారుల దగ్గర లభ్యమవుతున్నాయంటే మనం ఎంత ప్రమాదకర స్థితిలో ఉన్నామో అర్థమవుతుంది. ఇదంతా కేంద్ర, రాష్ట్ర విభాగాల మధ్య సమన్వయం సరిగా లేకపోవటం వల్లనేనని చెబుతారు. మన దేశంలో 1,100 దగ్గుమందు ఉత్పాదక సంస్థలుండగా, తనిఖీ చేసిన 90 శాతం సంస్థల్లో నిబంధనలు ఉల్లంఘనలు కనబడ్డాయనీ, వాటిపై చర్యలు తీసుకుంటు న్నామనీ ఇటీవల డీసీజీఐ రాజీవ్ రఘువంశీ చెప్పారు. దగ్గు మందు మాత్రమే కాదు... యాంటీ బయోటిక్స్, నొప్పి నివారణ మాత్రలు, గర్భస్రావ మాత్రలు, నిద్ర మాత్రలు వగైరాల విషయంలోనూ నియంత్రణలు అవసరం. వైద్యుల సలహా లేకుండా వాడటంవల్ల పౌరుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. ఆ సంగతి గ్రహించేలోగానే పరిస్థితి చేయిదాటుతోంది. గర్భస్రావ మాత్రలైతే మహిళల ప్రాణాలు తీస్తున్నాయి. కనుక మొత్తంగా ఔషధ రంగ వ్యవస్థను ప్రక్షాళన చేయటం అత్యవసరం.


## ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ 'విశ్వగురువు'గా ఎదుగుతోందని కొనియాడారు. యోగాను సామాన్య ప్రజలకు చేరువ చేయడంలో రామ్‌దేవ్ బాబా కృషి అమోఘమని ఆయన ప్రశంసించారు. ఆధ్యాత్మికత, యోగా సాధన ద్వారానే 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీ నుంచి 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేస్తామని, అందులో యోగాను అంతర్భాగం చేస్తామని వెల్లడించారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను తిరుపతిలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యం గంట సమయం యోగా, ధ్యానం కోసం కేటాయిస్తే ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదని చంద్రబాబు సూచించారు.

## సీఎం చంద్రబాబు రైతులకు క్షమాపణ చెప్పాలి


మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం జూన్ 20న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద మొదటి విడత ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. పీఎం-కిసాన్ పథకం నిధులతో కలిపి సుమారు 46.86 లక్షల రైతు కుటుంబాలకు ఈ ప్రయోజనం చేకూరింది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5,000, కేంద్రం వాటాగా రూ.2,000 కలిపి ప్రతి లబ్ధిదారుడికి మొత్తం రూ.7,000 చొప్పున అందాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా స్పందించిన షర్మిల, ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది అర్హులైన రైతులు ఉండగా, కేవలం కొంతమందికి మాత్రమే నిధులు కేటాయించారంటూ ఆమె ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పెట్టుబడి సాయం, కనీస మద్దతు ధర, పంటల బీమా వంటి వాగ్దానాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆమె సూచించారు.

## ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీ గంట సేపు వెయిటింగ్!



మొదటిపేజీ తరువాయి - విద్యార్థులు ఎలాంటి ఆందోళన, భయం లేకుండా పరీక్ష రాయాలని సూచించారు. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ), రాష్ట్ర ప్రభుత్వాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, యువత భవిష్యత్తుతో ఆడుకోవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ



మొదటిపేజీ తరువాయి -రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్‌ఎఫ్‌సీ (ఐఆర్‌ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

# అమరావతి మీదుగానే బుల్లెట్ రైలు




మొదటిపేజీ తరువాయి - నుంచి ఎలైన్‌మెంట్ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంది. రాజధాని అమరావతి మీదుగానే బుల్లెట్ రైల్ వెళ్లేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అలాగే తిరుపతి-చిత్తూరు లింక్ కారిడార్ డీపీఆర్ తయారీకి అనుమతిచ్చింది. బుల్లెట్ రైళ్లు పరుగులు పెట్టేందుకు నిర్మించనున్న హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ రాజధాని అమరావతి మీదుగానే వెళ్లనుంది. అమరావతికి కొంత దూరంలో రావెల వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించనుండగా దానికి ఆనుకొని హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ ఉండాలని కొంతకాలం క్రితం సీఎం చంద్రబాబు సూచించారు. ఈ మేరకు ఫైనల్ లొకేషన్ సర్వే, డీపీఆర్ తయారీకి నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ సిద్ధమైంది. అయితే విమానాశ్రయానికి ఆనుకొని ఎలైన్‌మెంట్ ఖరారుచేస్తే ఆ కారిడార్ రాజధాని నగరానికి, విజయవాడకు దూరమైపోతుంది. విమానాశ్రయం సమీపం నుంచి గుంటూరు వైపు వెళ్లాల్సి ఉంటుందని గుర్తించారు. దీంతో రాజధాని నగరానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో మొదట నిర్దేశించినట్లు అమరావతి మీదుగానే కారిడార్ వెళ్లేలా ఫైనల్ లొకేషన్ సర్వే, డీపీఆర్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సూచించింది. హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్ తెలంగాణ, ఏపీ, తమిళనాడుల్లో కలిపి మొత్తం 760.09 కిలోమీటర్లు ఉంటుంది. 18 స్టేషన్లు నిర్మిస్తారు. తెలంగాణలో 180.32 కిలోమీటర్లు కాగా, హైదరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, డ్రైపోర్ట్, హాలియా, వాడపల్లి వద్ద స్టేషన్లు నిర్మిస్తారు. ఏపీలో 518.54 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. ఇందులో దాచేపల్లి మొదటి స్టేషన్ అవుతుంది. ఆ తర్వాత అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి స్టేషన్లు నిర్మిస్తారు. తమిళనాడులో 61.23 కిలోమీటర్ల మేర కారిడార్ నిర్మించనుండగా, అందులో తిరువళ్లూరు, చెన్నై ఔటర్ రింగ్‌రోడ్ లేదా మింజూర్, చెన్నై సెంట్రల్ స్టేషన్లు ఉంటాయి. హైదరాబాద్- అమరావతి- చెన్నై కారిడార్ తిరుపతి విమానాశ్రయం మీదుగా వెళ్తుండగా, చెన్నై-బెంగళూరు కారిడార్ చిత్తూరు మీదుగా వెళ్తుంది. ఈ రెండు కారిడార్లకు లింక్ ఉండేలా తిరుపతి- చిత్తూరు మధ్య అనుసంధాన హైస్పీడ్ కారిడార్ నిర్మించాలని సీఎం చంద్రబాబు గతంలో సూచించారు. దీనిని పరిగణలోకి తీసుకున్న ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ అధికారులు ఈ ఎలైన్‌మెంట్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే, డీపీఆర్ తయారీపై దృష్టిపెట్టారు. చెన్నై-బెంగళూరు కారిడార్‌లో నాలుగు సొరంగాలు నిర్మిస్తున్నారు. చెన్నై నగర పరిధిలో సెంట్రల్ స్టేషన్ వద్ద 1.73 కిలోమీటర్ సొరంగ మార్గం ఉంటుంది. అటు బెంగళూరులో రెండు చోట్ల 14.79 కిలోమీటర్ల మేర సొరంగ మార్గాలు నిర్మిస్తున్నారు. మధ్యలో చిత్తూరు జిల్లాలో కౌండిన్య వన్యప్రాణి అభయారణ్యం మీదుగా ఈ కారిడార్ వెళ్తుంది. దీంతో పలమనేరు సమీపంలోని అటవీ ప్రాంతంలో 11.8 కిలోమీటర్ల మేర సొరంగం నిర్మించి, దానిలో నుంచి కారిడార్ వెళ్లేలా చూస్తారు. చెన్నై- బెంగళూరు కారిడార్ మొత్తం 306 కిలోమీటర్లు కాగా, అందులో తమిళనాడులో 133 కిలోమీటర్లు, ఏపీలో 72 కిలోమీటర్లు, కర్ణాటకలో 101 కిలోమీటర్లు ఉంటుంది. తమిళనాడులో చెన్నై సెంట్రల్, పూనమల్లె, పరందూరు, ఏపీలో చిత్తూరు, కర్ణాటకలో కోలార్, కొడిహళ్లి, వైట్‌ఫీల్డ్, బయప్పనహళ్లి స్టేషన్లు కలిపి మొత్తం 7 స్టేషన్లు ఉంటాయి. మన రాష్ట్రం మీదుగా వెళ్లే హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ మొత్తం 597 కిలోమీటర్లు ఉంటుంది. ఇందులో తెలంగాణలో 239 కిలోమీటర్లు, ఏపీలో 264 కిలోమీటర్లు, కర్ణాటకలో 94 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, ఆమనగల్లు, మన్ననూర్ లేదా పెన్మిల, సోమశిల, ఏపీలో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం, కర్ణాటకలో అలిపురా, దేవనహళ్లి, కొడిహళ్లి స్టేషన్లు కలిపి మొత్తం 15 స్టేషన్లు నిర్మించనున్నారు.

# 'నీట్'గా నో చెప్పిన అధికారులు

మొదటిపేజీ తరువాయి - నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ తెలంగాణలో కొనసాగుతోంది. పరీక్షను పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఈసారి జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ), రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీస్ శాఖలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. పలు చోట్లు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని లోపలికి అనుమతించలేదు. సోమాజిగూడలోని రాజభవన్ ప్రభుత్వ హైస్కూల్ నీట్ పరీక్షా కేంద్రానికి కేవలం ఒక్క నిమిషం ఆలస్యంగా చేరుకున్న ముగ్గురు విద్యార్థులను అధికారులు పరీక్షకు అనుమతించలేదు. సమయపాలన నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురయ్యారు. సికింద్రాబాద్‌లోని కీస్ పాఠశాలలో నీట్ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చారు. దీంతో ఇద్దరు విద్యార్థులను పరీక్ష కేంద్రంలో ఉన్న అధికారులు వెనక్కి పంపారు. పరీక్షా సమయానికి సకాలంలో రాకపోవడంతో అధికారులు వెనక్కి పంపగా ఓ విద్యార్థిని కన్నీటి పర్యంతమైంది. పరీక్ష మొదలైనప్పటికీ అనుమతిస్తారనే ఆశతో కొంత మంది విద్యార్థులు అక్కడే ఎదురుచూస్తున్నారు. బాగ్‌లింగంపల్లిలో నీట్ పరీక్ష కేంద్రానికి విద్యార్థిని ఆలస్యంగా వచ్చింది. బాగ్‌లింగంపల్లి బదులు తొలుత శేరిలింగంపల్లి వెళ్లిన విద్యార్థిని ఝాన్సీప్రియ పొరపాటు గ్రహించి బాగ్‌లింగంపల్లి వచ్చేలోపు గడువు ముగిసింది. నీట్ పరీక్ష రాసేందుకు కొడంగల్ నుంచి వచ్చింది.



కోఠిలోని నీట్ పరీక్ష కేంద్రానికి నలుగురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో వెనుదిరిగారు.

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!




మొదటిపేజీ తరువాయి - ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. గాలిలో వైరస్‌లు ఎక్కువసేపు నిలిచిపోవడానికి ఈ పరిస్థితులు దోహదపడుతున్నాయని బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం శుభ్రపడి, వైరస్‌ల వ్యాప్తి తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం స్వల్ప లక్షణాలతోనే ఉన్నప్పటికీ, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సొంతంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## తమిళనాడులో ఘోర ప్రమాదం



మొదటిపేజీ తరువాయి - ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో చాలా మంది 24-25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంట్యూబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

# ముగిసిన నీట్ రీ ఎగ్జామ్... ఇక అందరి దృష్టి ఫలితాలపై!


**ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ 2026 పునఃపరీక్ష**

**ఫిజిక్స్ కఠినంగా, బయాలజీ సులభంగా ఉందన్న విద్యార్థులు**

**దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు**

**జూన్ 28 నాటికి అధికారిక ఆన్సర్ కీ విడుదల అంచనా**

**జూలై చివరి వారంలో ఫలితాలు వెల్లడయ్యే అవకాశం**




దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించారు. దివ్యాంగులకు 6.20 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. సుమారు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. భారత్‌తో పాటు రియాద్‌లోని అంతర్జాతీయ కేంద్రంలో కూడా పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. కాగా, ఎప్పట్లాగానే పలు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, తమను లోపలికి అనుమతించకపోవడంతో కన్నీటి పర్యంతం కావడం కనిపించింది. పరీక్ష రాసిన విద్యార్థుల ప్రాథమిక విశ్లేషణ ప్రకారం, ఈసారి ప్రశ్నపత్రం మొత్తం మీద మధ్యస్థంగా ఉంది. అన్ని విభాగాల్లోకెల్లా ఫిజిక్స్ అత్యంత కఠినంగా ఉందని, ఆ తర్వాత కెమిస్ట్రీ ఉందని విద్యార్థులు తెలిపారు. అయితే, బయాలజీ విభాగం మాత్రం చాలా సులభంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష ముగియడంతో, వివిధ కోచింగ్ సంస్థలు త్వరలోనే అనధికారిక ఆన్సర్ కీలను విడుదల చేయనున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారిక ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 28 నాటికి విడుదల చేసే అవకాశం ఉంది. దీనిపై అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత తుది కీని, ఫలితాలను ప్రకటిస్తారు. నీట్ యూజీ 2026 ఫలితాలను జూలై చివరి నాటికి వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమ స్కోర్‌కార్డులను అధికారిక వెబ్‌సైట్ అవవ్.ఞ్తు.అఋ.అఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 2026లో జరిగిన పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, దానిని రద్దు చేసి ఈ పునఃపరీక్షను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను గమనించాలని అధికారులు సూచించారు.

# కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

**డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్**

**కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు**

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.



# యోగతో ఆరోగ్యం





## ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్. భారతి

ప్యాపిలి, జూన్ 21 (సీమ కిరణం న్యూస్) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల గ్రౌండ్ లో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసిల్దార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఒత్తిడిని కూడా దూరం చేసుకోవచ్చని తెలిపారు. తహసిల్దార్ భారతి మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని పేర్కొన్నారు. యోగా ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. చివరగా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, పంచాయతీ అభివృద్ధి అధికారి శివకుమార్ గౌడ్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, వైద్యాధికా డాక్టర్ రాహుల్, మండల విద్యాధికారులు మహేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర నాయక్, శిశు మందిరం ప్రధాన ఉపాధ్యాయులు పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# యోగ సాధనతో ఆరోగ్య రక్షణ





## ఎమ్మెల్యే కే.ఈ. శ్యాం కుమార్

## వెల్దుర్తిలో ఘనంగా 'యోగాంధ్ర' కార్యక్రమం

## హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు



వెల్దుర్తి, జూన్ 21, (సీమకిరణం న్యూస్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యాం కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఈ. శ్యాం కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు యోగా సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. ఈ యోగాంధ్ర కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పోలీసు శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే గురుకుల కళాశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యోగా మాస్టర్లు, యోగా ట్రైనర్లు పాల్గొని ఆసనాలు వేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీఓలు, ఎంబీకేలు, వీబీకేలు, అంగన్‌వాడీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బారాయుడు, ఎల్.ఈ. జ్ఞానేశ్వర్ గౌడ్, సుధాకర్ గౌడ్, గురుకుల పాఠశాల చైర్మన్ బాబురావు, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొని యోగా ప్రాముఖ్యతను చాటారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని క్రమశిక్షణతో, విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను, ఉపాధ్యాయులను పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

## జిల్లాలో ఘనంగా 12వ అంతర్జాతీయ

# యోగా దినోత్సవ నిర్వహణ



### శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాని మించిన మార్గం లేదు : జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి

### యోగాతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం.

### ప్రతి కుటుంబం యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి.

### విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణకు యోగా దోహదపడుతుంది.

### యోగా కార్యక్రమంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.

కర్నూలు, (సీమకిరణం న్యూస్): జూన్ 21: యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని, శారీరక, మానసిక, భావోద్వేగ మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్.ఏ.పీ క్యాంప్ మైదానంలో కలెక్టర్ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా. ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, సెట్కూర్ సీఈవో డా.వేణుగోపాల్, జిల్లా పర్యాటక శాఖాధికారి లక్ష్మీ నారాయణ, జడ్పీ సీఈవో రమణా రెడ్డి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డా. ప్రసాద్, నోడల్ ఆఫీసర్ డా. అమర్నాథ్, రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, విద్యా సంస్థల అధినేత కె. వి. సుబ్బారెడ్డి, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం కలెక్టర్, ఎస్పీ, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో ఎన్.సి.సి కాడెట్స్, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని, యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా అనేది కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాదని, మనిషి జీవనశైలిని సక్రమంగా తీర్చిదిద్దే సమగ్ర సాధనమని తెలిపారు. ఆధునిక జీవన విధానంలో పెరుగుతున్న ఒత్తిడులు, జీవనశైలి వ్యాధులు, మానసిక ఆందోళనల నుంచి ఉపశమనం పొందడానికి యోగా అత్యంత ప్రభావవంతమైన మార్గమని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి గుర్తింపుతో ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం భారతీయ సంస్కృతికి దక్కిన విశిష్ట గౌరవమని పేర్కొన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు మరియు మహిళా సంఘాల ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక యోగా శిబిరాలు, అవగాహన సదస్సులు, సామూహిక యోగా ప్రదర్శనలు నిర్వహించామని వెల్లడించారు. యోగాను ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు అభ్యసించడం ద్వారా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అనేక జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు మరియు వృద్ధులు యోగాను తమ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో ఎక్కువ సమయం కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల వినియోగంతో గడుపుతున్న నేపథ్యంలో శారీరక చలనం తగ్గిపోతున్నదని, ఈ పరిస్థితుల్లో యోగా శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఏకాగ్రతను పెంచుతుందని తెలిపారు. విద్యార్థులలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించడంలో యోగా విశేషంగా దోహదపడుతుందని వివరించారు. ప్రతి కుటుంబం రోజువారీగా యోగా సాధనకు కొంత సమయం కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన కుటుంబాలు, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలో గత 14 రోజులుగా సాగిన యోగా కార్యక్రమాలలో భాగంగా శానిటేషన్ వర్కర్స్ తో థీమాటిక్ యోగా నిర్వహించామని తెలిపారు. రాక్ గార్డెన్స్, కొండారెడ్డి బురుజు వంటి టూరిస్ట్ స్పాట్‌లలో 500 మందితో యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఇదే కాకుండా ఆరు దేవాలయాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం యోగాకు సంబంధించి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించామని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5,34,000 మంది యోగాకు రిజిస్టర్ చేసుకుని, పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, యోగా సాధన కూడా అందులో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చెబుతున్నదనే కాకుండా, ఆరోగ్యమే మహాభాగ్యమనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని యోగాను జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### యోగాతో ఆరోగ్యం -- ఆరోగ్యంతో ఆనందం -- ఆనందంతో అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలోని "నషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలందరికీ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా బీసీ వసతి గృహంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

### ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగాతో విద్యార్థినుల సందడి







వెల్దుర్తి, జూన్ 21, (సీమకిరణం న్యూస్) : కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్దుర్తి బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఘనంగా యోగా కార్యక్రమాలు నిర్వహించారు. వసతి గృహ అధికారిణి గిరిజాదేవి ఆధ్వర్యంలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థినీలు వివిధ యోగాసనాలు చేసి యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య భారతి ప్రతినిధి శ్రీమతి కృష్ణవేణి పాల్గొని విద్యార్థినీలకు యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వసతి గృహ అధికారిణి గిరిజాదేవి, కృష్ణవేణి మాట్లాడుతూ యోగాసనాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. యోగా దినోత్సవం రోజున మాత్రమే కాకుండా ప్రతిరోజూ విద్యార్థినీలు యోగాసనాలు చేసేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

# మీకు అండగా అంటున్న రెవెన్యూ అధికారుల సంఘం.

కణేకల్ (సీమకిరణం న్యూస్):జూన్ 21. : కనేకల్ మండలం జక్కలవాడికి గ్రామ వీఆర్వో నారాయణస్వామి వారి కుటుంబ సభ్యులకు రూ.1,00,000/- ఆర్థిక సహాయం అందజేసిన జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. అనంతపురం జిల్లా కణేకల్ మండలంలోని జక్కలవడికి గ్రామ వీఆర్వో నారాయణస్వామి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో, ఆయనకు అండగా నిలుస్తూ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తరఫున రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నారాయణస్వామి త్వరగా కోలుకొని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షిస్తూ, జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఈ సహాయాన్ని అందించింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ అధికారుల కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ అండగా ఆర్థిక భరోసా అందిస్తుందని తెలిపారు. సహోద్యోగులు రమేష్,రఘు, పవన్ కుమార్, ఆదినారాయణ , వన్నూరుస్వామి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం చేసిన ఈ సహాయాన్ని అభినందిస్తూ నారాయణస్వామి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

## నీట్ పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





కర్నూలు,(సీమకిరణం న్యూస్): జూన్ 21:- నీట్ పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. .ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో, కేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష సజావుగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు విద్యాశాఖ, పోలీసు, వైద్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు (సీమకిరణం న్యూస్):జూన్ 21 : కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా **https://Meekosam.ap.gov.in** వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

## సెబీ చీఫ్ బుచ్ రాజీనామా చేయాలి ఉద్యోగుల నిరసన

### సెబీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల నిరసనలు

క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉద్యోగులు నిరసనల బాట పట్టారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న సెబీ చీఫ్ మాధబీ పురి బుచ్ రాజీనామాను కోరుతూ ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోగల హెడ్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన ఇచ్చారు. బుచ్‌తోపాటు ఈ వ్యవహారంలో ఉన్న ఇతర అధికారుల కార్యాలయాల ముందూ నిరసనల్ని వ్యక్తం చేశారు. ఇందులో 200 మందికిపైగా పాల్గొన్నట్టు అంచనా. వీరిలో ఎవరూ మీడియా ముందు మాట్లాడలేదు. కానీ బుధవారం సెబీ విడుదల చేసి పత్రికా ప్రకటనను ఉపసంహరించుకోవాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని నినదించారు. సుమారు గంటన్నరపాటు ఈ నిరసనలు కొనసాగాయి. నిజానికి గతంలోనూ ఇదే తరహాలో సెబీ ప్రధాన కేంద్రం వద్ద ఆందోళనలు జరిగాయి. అయితే వాటికి, ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి ఉన్నతాధికారులు కొట్టిపారేశారు. ఆ నేపథ్యంలో తాజా ఉద్యోగుల నిరసన మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. అదానీ గ్రూప్ వ్యవహారంలో బుచ్ పాత్ర కూడా ఉందని, విదేశాల్లోని కొన్ని సంస్థల్లో ఆమెకు, ఆమె భర్తకు వాటాలున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. అప్పట్నుంచి బుచ్ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 6న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సెబీలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారుల తీరు అస్సలు బాగాలేదంటూ దాదాపు 500 మంది ఉద్యోగులు లేఖ రాశారు.

## అయోధ్యకు వెళ్తే వీటిని చూడడం అస్సలు మిస్సవ్వొద్దు



యావత్ భారతదేశం దృష్టంతా అయోధ్య వైపే ఉన్నది. రామ మందిరం ప్రారంభోత్సవంతో పాటు రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ కనుల పండువలా సాగింది. ఎన్నో శతాబ్దాల భారతీయుల కల సాకారమైంది. ఈ క్రమంలో భారతంలో పండుగ వాతావరణం నెలకొన్నది. దాదాపు 500 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఆలయం రూపుదిద్దుకొని బాల రాముడు భక్తులకు సాక్షాత్కరించాడు. ఈ నేపథ్యంలో చాలా మంది రాముడి జన్మస్థలమైన అయోధ్యకు వెళ్లాలని భావిస్తుంటారు. అయితే, కేవలం అయోధ్యలో రామ మందిరమే కాకుండా ఇంకా ఎన్నో ప్రసిద్ధి ఆలయాలు, ప్రదేశాలు సైతం ఉన్నాయి. ఎవరైనా అయోధ్యకు వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటే ఈ ప్రాంతాలను సైతం చూడడం అస్సలు మిస్సవ్వొద్దు. అక్కడ ఏయే చారిత్రక, పర్యాటక ప్రాంతాలున్నాయో ఓలుక్కేద్దాం..!

### హనుమాన్ గర్హి




అయోధ్యలో మరో చారిత్రాత్మక ఆలయం ఉన్నది. అదే హనుమాన్‌గర్హి. ఇక్కడ గుహ కూడా ఉంటుంది. ఇందులోనే హనుమంతుడు నివసిస్తున్నాడని ఇక్కడి ప్రజల విశ్వాసం. అందుకు అయోధ్యకు వెళ్లిన ప్రతి ఒక్కరూ హనుమాన్ గర్హిని సైతం తప్పక దర్శిస్తుంటారు. హనుమాన్ గర్హి ఆలయం నాలుగు వైపుల కోట ఆకారంలో ఉంటుంది. ప్రతి మూలలో వృత్తాకార ప్రాకారాలు కనిపిస్తాయి. ప్రధాన ఆలయానికి చేరుకోవడానికి 76 మెట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ హనుమంతుడు ఆరు అంగులాల ఎత్తులో బాలుడి రూపంలో కనిపిస్తాడు. తల్లి అంజనీదేవి ఒడిలో ఉన్నట్లుగా ఉంటుంది. హనుమంతుడిచే రామనామం రాయబడిన వెండి తులసీహారం అలంకరించి ఉంటుంది. ఆలయ గోడలపై హనుమాన్ చాలీసా శ్లోకాలు కనిపిస్తాయి. ఆలయంలో ఓ స్తంభం ఉంటుంది. దాన్ని విజయం స్తంభంగా పిలుస్తుంటారు. అయోధ్యలోని రామ మందిరాన్ని సందర్శించే భక్తులు ముందుగా హనుమాన్ గర్హిని దర్శించడం ఆనవాయితీ.

### కనక్ భవన్



అయోధ్యలో రామాయణ కాలానికి చెందిన కనక్ భవన్ సైతం ఉంది. శ్రీరాముడు సీతాదేవిని వివాహమాడిన తర్వాత కైకేయి సీతాదేవికి కానుకగా ఇచ్చినట్లు స్థల పురాణం చెబుతున్నది. ఈ భవనం సీతారాముల ఆంతరంగిక భవనంగా ఉండేదని ప్రతీతి. అయోధ్యలో ఉన్న ఈ భవన్ అద్భుతమైన శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ భవనంలో సీతారాముల విగ్రహాలుంటాయి. త్రేతాయుగం నాటి ఈ భవనం శిథిలావస్థకు చేరితే ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు స్వయంగా నిర్మించాడని చరిత్ర చెబుతున్నది. మధ్యయుగ కాలంలో విక్రమాదిత్య చక్రవర్తి, ఆ తర్వాత ఓర్చా రాణి వృషభాను కున్వారి పునరుద్ధరించినట్లు స్థల పురాణం చెబుతున్నది. గర్భాలయంలో సీతాదేవితో కలిసి శ్రీరాముడు దర్శనమిస్తాడు.

### సరయూ ఘాట్




అయోధ్యకు వెళ్లే వారి తప్పనిసరిగా సరయూ ఘాట్‌ను తప్పకుండా సందర్శించాల్సిందే. ప్రతి సంవత్సరం రామనవమి, దీపావళి, విజయదశమి వంటి పర్వదినాలలో వేలాది మంది ప్రజలు సరయూ నది ఒడ్డుకు వస్తుంటారు. ఈ నది గురించి పురాతన హిందూ గ్రంథాల్లోనూ ప్రస్తావించారు. శతాబ్దాలుగా యాత్రికులు, పర్యాటకులను ఆకర్షిస్తోంది. అయోధ్య పట్టణాన్ని ఆనుకొని ప్రవహిస్తుంది. ఈ నదిలోనే రామలక్ష్మణులు అవతారాలు చాలించారని భక్తుల విశ్వాసం. ఈ నదిని గోగ్రానది అని సైతం పిలుస్తుంటారు.

### తులసీ భవన్..




రామచరితమానస్, హనుమాన్ చాలీసాను రచించిన గోస్వామి తులసీదాస్ జ్ఞాపకార్థం నిర్మించారు. తులసీ స్మారక్ భవన్‌లో అయోధ్య శోధ్ సంస్థాన్ (అయోధ్య పరిశోధన కేంద్రం)గా ఉంది. అయోధ్య నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సాహిత్య సంప్రదాయాలను అధ్యయనం చేస్తుంది. అయోధ్యలో రామచరిత్ మానస్ రచయిత, సాధువు కవి గోస్వామి తులసీదాస్ జీకి అంకితం చేసిన స్మారక చిహ్నం కూడా కొలువై ఉంది. దీనినే తులసి స్మారక్ భవన్ అని పిలుస్తారు. ఇక్కడ ప్రార్థనలు, భక్తి సంగీతం, నాటకాలు, రాంలీలా, రామకాంత పారాయణ, తదితర కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. ఈ భవనంలో ఉన్న అయోధ్య రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో గోస్వామి తులసీదాస్ సాహిత్య రచనల పెద్ద భాండాగారం సైతం ఉన్నది.

### నాగేశ్వరనాథ్ ఆలయం




అయోధ్య రామాలయం సందర్శించిన అనంతరం ఇక్కడే కొలువైన నాగేశ్వర్ నాథ్ ఆలయాన్ని సైతం తప్పకుండా దర్శించుకోవాలి. శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించించిన ఆలయమే ఈ నాగేశ్వరనాథ్ ఆలయమని స్థలపురాణం చెబుతున్నది. ఆలయంలోని శివలింగానికి భక్తులు సరయూనది నుంచి నీటిని తీసుకువచ్చి అభిషేకం చేస్తుంటారు. ఈ ఆలయాన్ని రాముడి కుమారుడు కుశుడు నిర్మించాడని ప్రతీతి. 1750 లో నవాబ్ సఫ్దర్ జంగ్ మంత్రి నావల్ రాయ్ ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఈ ఆలయాన్ని సందర్శించడానికి సరైన సమయం శివరాత్రి. ఇక్కడ శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజున శివుడి బరాత్ (ఊరేగింపు) సైతం జరుపుతారు.

### గులాబీ తోట




అయోధ్య ఆధ్యాత్మిక ప్రదేశాలతో పర్యాటక ప్రాంతాలు సైతం ఉన్నాయి. ఇందులో ఒకటి గులాబ్ బారీ. నగరంలోని అత్యంత అందమైన తోటల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి పచ్చదనం పర్యాటకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. 8వ శతాబ్దంలో ఈ తోటలో అనేక రకాల రంగురంగుల గులాబీ మొక్కలను నాటారు. ఇక్కడ 1753-1775 మధ్య అయోధ్యను పాలించిన పాలించిన అవధ్ మూడో నవాబ్ అయిన షుజా-ఉద్-దౌలా సమాధి ఉంటుంది. దేశంలోని అన్ని ప్రాంతాలలకు చెందిన ప్రకృతి ప్రేమికులను, వృక్షశాస్త్రజ్ఞులను గులాబీలు ఆకర్షిస్తాయి. ఇస్లామిక్ నిర్మాణ శైలి సమాధి ఉంటుంది. గార్డెన్‌లోకి ప్రవేశించగానే భారతదేశ జాతీయ చిహ్నంతో కూడిన పెద్ద స్తంభం అందరికీ స్వాగతం పలుకుతుంది. గార్డెన్‌లో అందమైన మసీదు, దాని పక్కనే చిన్న వాచ్‌టవర్ ఉన్నది. సమాధి వంపు మార్గాల గుండా నడస్తూ వెళ్తుంటో ఆ అనుభూతే వేరు.

### మోతీ మహల్



అయోధ్యలో ప్రకృతి సౌందర్యంతో నిండిన చారిత్రక ప్రదేశాల్లో మోతీ మహల్ ఒకటి. చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన ఫైజాబాద్‌లో ఉన్న ఒక స్మారక చిహ్నం. చాలా మంది మోతీ మహల్‌ను 'పెర్ల్ ప్యాలెస్' అని కూడా పిలుస్తుంటారు. మోతీ మహల్ అయోధ్య పట్టణానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంది. 1743 ఏడీలో నిర్మించబడిన ఈ ప్యాలెస్ అప్పటి నవాబ్ షుజా-ఉద్-దౌలా భార్య రాణి బేగం ఉన్మతుజ్జోహ్రా బాను నివాసంగా ఉండేది. మొఘల్ వాస్తుశిల్పకళ భవనంలో అద్భుతంగా నిలుస్తుంది. వీటితో పాటు ఇంకా రామ్‌కోట్, శ్రావస్తి తదితర పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

# అసమానతల భారతం



ఐఎంఎఫ్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. అయినప్పటికీ, మన దేశంలోని అనేక నగరాల్లో ఖరీదైన విల్లాల పక్కనే మురికివాడలు దర్శనమిస్తాయి. ముంబైలో ఉన్న ఆసియాలోనే అతిపెద్ద మురికివాడ ధారావి అందుకు నిదర్శనం. మన దేశ వృద్ధి అంతంతమాత్రంగానే ఉండి, ఆదాయ అసమానతలకు దారితీయడానికి ఒక కారణం ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై తక్కువ పెట్టుబడులు పెట్టడమే ఆదాయ అసమానతలకు ప్రధాన కారణమని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ గతంలో పేర్కొన్నారు. తద్వారా అధిక ఆదాయ వర్గాల్లోని విద్యావంతులు, ఆరోగ్యవంతులు వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ నుంచి డబ్బు సంపాదించేందుకు ఎక్కువ అవకాశాలను పొందారు. అదే సమయంలో అత్యల్ప ఆదాయ వర్గాల్లోని నిరక్షరాస్యులైన కార్మికులు ఇప్పటికీ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకే కష్టపడుతున్నారు. ప్రపంచ అసమానతల నివేదిక- 2022 ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక ఆదాయ అసమానతలు కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. దేశ వృద్ధిని గొప్పగా ప్రచారం చేస్తున్న మీడియాలోని ఒక వర్గం అంతర్గత సమస్యలను కప్పిపుచ్చుతున్నది. విదేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు ఇటీవల ఒక వార్త హల్‌చల్ చేసింది. ప్రజల ఆదాయం పెరిగినట్టు దీని ద్వారా పైకి తెలుస్తున్నప్పటికీ.. అసలు వాస్తవం వేరే ఉన్నది. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో లక్షల మంది విమాన ప్రయాణం చేసినంత మాత్రాన ఆదాయం పెరిగినట్టు కాదు. అమెరికాలో ఆదాయ అసమానతలు భారీగా ఉన్నప్పటికీ, ఆ దేశ ప్రజలు కూడా విమానయానం ఎక్కువగానే చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే.. విదేశాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగినంత మాత్రాన దేశంలో అసమానతలు తగ్గి, ఆదాయ పంపిణీ మెరుగైనట్టు కాదు. గృహ సర్వేల ఆధారంగా అసమానతలను పలు సర్వే సంస్థలు అంచనా వేస్తాయి. అయితే, ఇవన్నీ స్వీయ ప్రకటిత ఆదాయాలపై ఆధారపడి చేసిన సర్వేలే. విదేశాల నుంచి లభించే ఆదాయాలు లేదా నల్లధనం ఈ నివేదికలకు చిక్కవు. అందుకే, నివేదికల్లో పేర్కొన్న దానికంటే మరింత ఎక్కువగా వాస్తవ అసమానత ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ, ఈడీల చేతికి చిక్కకుండా ఉండేందుకు ధనవంతులు నల్లధనాన్ని ఎక్కువగా విదేశాల్లో దాచిపెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. షెల్ కంపెనీలు, అనామక ట్రస్టుల ద్వారా నిధులు మళ్లిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి తప్పించుకుంటున్నారు. విదేశాల్లో నల్లధనం దాచిన చాలామంది భారతీయుల వివరాలను 2013లో పనామా పేపర్స్ బహిర్గతం చేశాయి. వాషింగ్టన్ డీసీకి చెందిన గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ (జీఎఫ్ఐ) నివేదిక ప్రకారం.. 1948-2008 మధ్యకాలంలో 213.2 బిలియన్ డాలర్ల నల్లధనం మన దేశం నుంచి తరలిపోయింది. అయితే, సరైన ఆధారాలు లేకపోవడం, అంతర్జాతీయంగా ఉండే సంక్లిష్టతల కారణంగా వారిపై చర్యలు తీసుకోవడానికి వీల్లేకుండాపోయింది. సాధారణంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందితే.. అది పన్నులు, ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలి. ఉదాహరణకు వ్యాపారాలు వృద్ధి చెంది కంపెనీలకు ఎక్కువ లాభాలు వస్తే.. కార్పొరేట్ పన్ను పెరుగుతుంది. ఉపాధి పెరగడం ద్వారా ఆదాయ పన్ను పెరుగుతుంది. ప్రజలు ఎక్కువగా ఖర్చు చేయడం మూలంగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతాయి. కానీ, వేగవంతమైన ఈ వృద్ధి సంఘటిత రంగంలో ఉద్యోగాలను సృష్టించడం లేదు. అందువల్ల ఎక్కువమంది అసంఘటిత రంగంలో పని చేస్తూ పొట్ట పోసుకోవాల్సి వస్తున్నది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినప్పటికీ ప్రజల ఆదాయం మాత్రం మందగిస్తున్నది. అంతేకాదు, తత్ఫలితంగా జీడీపీ కూడా తగ్గుముఖం పడుతున్నది. అందరి భారం తామే ఎందుకు మోయాలనే ఉద్దేశంతో చాలామంది పన్నులను ఎగవేసేందుకు దారులు వెతుకుతున్నారు. సంపద, ఆదాయ పంపిణీలో తీవ్రమైన అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్యం వెనుకబాటుతనానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. 2014లో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ పెరుగుతున్న ఆదాయ అసమానతలు, ప్రజాస్వామ్య వెనుకబాటుతనానికి మధ్య స్పష్టమైన సంబంధం ఉంది. ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, సబ్సిడీలు ప్రజల మధ్య ఉన్న ఆదాయ అసమానతలను తగ్గించడంలో విఫలమయ్యాయనే చెప్పాలి. అంతేకాదు, ఇవి ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి మద్దతును కూడగట్టడంలోనూ విఫలమయ్యాయి. అందుకే బీజేపీ సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో ఆదాయ అసమానతలు లేని, సంపద పంపిణీ అందరికీ సమానంగా జరిగే ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరమున్నది.

# గల్లా బుడ్డి కిరికిరి..







## ఎటమటం

చెయ్యి పార్టీ అమాత్యుడొకరు ముఖ్య నేత మీద మస్తు గుస్సా అయ్యిండట. 'చెల్ ఈ మాత్రం దానికి నాకీ కొలువే వద్దు పో..!' అని గరం గరం అయిపోయిండట. ఇప్పుడు అందరూ గీ ముచ్చట మీదనే గుసగుసలు పెడుతున్నరు. మధువు అమాత్యుడు అంటే ఎంత ఆమ్దాని ఉండాలే. కానీ, సారుకు రూపాయి కూడా రానియ్యకుండ బుడ్డ పైస కాడ.. పెద్ద పైస కాడ 'ముఖ్య' నేతే ముందుబడి ఎక్సైజ్ చేస్తున్నడట. వచ్చిన రొక్కం వచ్చినట్టే గల్ల గురిగిల వేసుకొని పోతుంటే.. అమాత్యునికి కోపం వచ్చి నేరుగా ముఖ్య నేత దగ్గరకే పోయి నిలదీసిండట. 'దుడ్లన్ని మీరే దిగమింగితే నా గతేంగాను' అని కొట్లాట పెట్టిండట. దెబ్బకు ముఖ్య నేత దిగొచ్చి 'అన్నా.. నువ్వు జరంత కాక మీదున్నవు. ముందుగైతే మనోళ్లు గా దేశం పోతుండ్రు. నువ్వు కూడా పోయి సల్లబడి రాపో.. తిరిగొచ్చే సరికి లెక్కజేసి నియ్యి నీకిత్తా' అని బుజ్జగించి గాలిమోటరు ఎక్కించిండని జనం అనుకుంటున్నరు.

### అల్లుడు.. గిల్లుడు

ఇప్పటి దాక నలుగురు అన్నదమ్ములే పేరు మోసింద్రు కదా..! ఇగ ఇప్పుడు అల్లుడు కూడా తయారైండు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలని సామెత ఉండనే ఉన్నదిగా. మామ వెలుగు మీదున్నప్పుడే అధికారం చేయాలని అనుకున్నడో ఏమో! భీమారం బ్యాచ్‌ను దింపిండు. చేప పిల్లలను గిల్లే యవ్వారం మీద కన్నేసిండు. అల్లుడు కన్ను గీటితేనే కాంట్రాక్టు ముందుకు సాగేది. 'చెరువెండి పోతుంది గా కంటిసైగ ఏదో చెయ్యి బాబు' అని మత్స్య శాఖ అధికారులు ప్రాధేయ పడంగ.. పడంగ కాంట్రాక్టులు ఓకే చేసిండట. జూలై, ఆగస్టు మాసాల్లో చెరువుల వదలాల్సిన చేప పిల్లలను ఇప్పుడు వదిలితే ఎట్ల ఎదుగుతయని మత్స్యకార కుటుంబాలు గోల పెడుతున్నాయి.


### ఏనుగును తరిమేయండి..!

'అధ్యక్షా..!' అని పిలిపించుకున్న పెద్దాయనకు ఈ మధ్య ఎటుపోయినా.. ఏనుగే అడ్డం వస్తుందట. సమీక్షలకో.. సమావేశాలకో వెళ్లి 'ఇక మొదలుపెట్టండి' అని ఆర్డర్ వేస్తే.. ఏనుగు రావాలె సార్ అని అధికారులు అంటున్నరట. అరే.. ఈ వాడకు నేనే పెద్ద రెడ్డిని, పిల్ల ఏనుగుతో ఏముంది. 'పని కానివ్వండి' అని హూంకరించినా.. అధికారులు తలలు అడ్డంగా ఊపుతున్నరట. కటకటా ఈ అవమానభారం ఇక మోయలేను అనుకుంటూ.. పట్నంబోయి పిల్ల ఏనుగును తరిమికొట్టి తనకు పట్టాభిషేకం చేయాలని చీఫ్ నేతకు విన్నవించుకుంటే.. చీఫ్ నేత చెవులు ఊపిండట గానీ, చేతలు మాత్రం ఇప్పటి వరకు లేవు. కారు గుర్తు మీద గెలిచిన ఆ పెద్దాయన సారుకు చెయ్యిచ్చి పార్టీ ఫిరాయించిండు! అక్కడ అప్పటికే నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న నేత అడుగడుగునా అడ్డం పడుతున్నడు. ఆయన్ను తప్పించాలని ఎంత మొరపెట్టుకున్నా కాంగ్రెస్ పెద్దలు పట్టించుకోవటం లేదట. సారు పక్కన కారు మీదుండంగ తన వైభవం ఎట్లుండే.. ఇప్పుడట్లైపోతినని తలుచుకొని పెద్దాయన తెగ బాధ పడుతున్నడట.

### ఉత్త పుణ్యానికి పోతే..

మహాభారతంలో పైలుడి శిష్యుడు ఉదంకుడు కథ తెలుసు కదా..! సేమ్ టు సేమ్ ఉత్త పుణ్యానికి పోతే పాపం ఎదురైందట. ముఖ్య నేత ఊ.. అంటే సూట్‌కేసు పట్టుకొని ఢిల్లీకి ఉరుకుతున్నడు కదా..! ఆయన ఇన్నిసార్లు పోంగ నేనెందుకు పోవద్దు అనుకున్నాడో కీలక నేత. ముఖ్య కూటం మీద ఆయనకు కూడా ఎప్పటి నుంచో కన్నుంది. వడ్ల పైసలు జమ చేసుకొని రెండు సూట్‌కేసుల నిండా సర్దుకొని ఢిల్లీ పోయిండట. అధిష్ఠానానికి కబురు పెడితే.. ఫలానా ఆయనకు ఇవ్వమని చెప్పారట. సూట్‌కేసులు అందుకున్న ఢిల్లీ పెద్దాయన హైదరాబాద్‌కు ఫోన్ చేసి 'మీ వోడు మాకు సూట్‌కేసులు ఇచ్చిండు. నీ సీటుకు ఎసరు పెట్టేటట్టున్నడు. జర చూసుకో' అని చెప్పిండట. ఇంకేముంది. ముఖ్య నేత ఇంటెలిజెన్స్‌ను ఎగేసి, సగేసి చిట్టా అంత తీయించి దగ్గర పెట్టుకున్నడు. తీరా హైదరాబాద్ వచ్చాక విషయం తెలిసిన కీలక నాయకుడు ఉత్త పుణ్యానికి పోతే పాపం ఎదురైందని తల పట్టుకున్నాడని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.

# పర్యాటకులకు ఐఆర్‌సీటీసీ గుడ్‌న్యూస్ భారత్ గౌరవ్ రైలులో తొమ్మిదిరోజుల కార్తీకమాసం స్పెషల్ దివ్యదక్షిణ యాత్ర



ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పలు ఆలయాలను దర్శించుకోవాలని పలువురు భావిస్తుంటారు. ముఖ్యంగా శివాలయాలను దర్శించుకోవాలనుకుంటున్నారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకుటున్న వారికి ఐఆర్‌సీటీసీ టూరిజం ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. పర్యాటకులకు ఐఆర్‌సీటీసీ గుడ్‌న్యూస్..! భారత్ గౌరవ్ రైలులో తొమ్మిదిరోజుల కార్తీకమాసం స్పెషల్ దివ్యదక్షిణ యాత్ర..!ఈ ఏడాది అక్టోబర్ 23వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభంకానున్నది. ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పలు ఆలయాలను దర్శించుకోవాలని పలువురు భావిస్తుంటారు. ముఖ్యంగా శివాలయాలను దర్శించుకోవాలనుకుంటున్నారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకుటున్న వారికి ఐఆర్‌సీటీసీ టూరిజం ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. దివ్యదక్షిణ యాత్ర విత్ జ్యోతిర్లంగ యాత్ర పేరుతో స్పెషల్ టూర్ ప్యాకేజీని తీసుకువచ్చింది. ఈ ప్యాకేజీలో ప్రయాణం నవంబర్ 6న ప్రారంభం కానున్నది. టూర్ ప్యాకేజీలో తొమ్మిదిరోజులు, ఎనిమిది రాత్రుల పాటు పర్యటన కొనసాగుతున్నది. ప్యాకేజీలో తిరువణ్ణామలైలోని అరుణాచలం, రామేశ్వరంలోని రామేశ్వరస్వామి, మధురైలో మీనాక్షి అమ్మవారు, కన్యాకుమారిలో రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం, త్రివేంద్రంలో అనంతపద్మనాభ స్వామి ఆలయం, తిరుచ్చిలో రంగనాథస్వామి, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఈ టూర్ ప్యాకేజీలో పర్యటన హైదరాబాద్ నుంచి ప్రారంభమవుతుంది. భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్ జంక్షన్, ఖమ్మం, మదిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగులో, కావలి, నెల్లూరు, గూడురు, రేణిగుంట స్టేషన్లలోనూ రైలు ఆగుతుంది. ఇక పర్యటన భారత్ గౌరవ్ టూరిజం రైలులో కొనసాగుతుంది.

### పర్యటన కొనసాగేదిలా..

కార్తీక మాసం ప్రత్యేక దివ్య దక్షిణ్ యాత్ర తొలిరోజు నవంబర్ 6న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మొదలవుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు పర్యాణికులు భారత్ గౌరవ్ రైలులో మొదలవుతుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు బోనగిరికి చేరుతుంది. రోజురోజు వేకువ జామున 1.20గంటలకు కావలి రైల్వేస్టేషన్‌కు రైలు వెళ్తుంది. ఉదయం 7.30 గంటలకు తిరువణ్ణామలై చేరుతుంది. ఆ తర్వాత హొటల్‌కు చేరుకొని దర్శనాలు పూర్తి చేసుకుంటారు. రాత్రి 10గంటలకు స్టేషన్‌కు చేరుకొని రామేశ్వరానికి ప్రయాణమవుతారు. మూడోరోజు ఉదయం 6.30 గంటలకు కుడాల్‌నగర్ స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా రామేశ్వరం చేరుకుంటారు. రామేశ్వర స్వామి దర్శనంతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలకు వీక్షించేందుకు వెళ్తారు. రాత్రి రామేశ్వరంలోనే బస ఉంటుంది. నాలుగో బస్సు ద్వారా మధురైకి బయలుదేరుతారు. అక్కడ మీనాక్షి అమ్మవారి ఆలయంలో దర్శనాలు చేసుకుంటారు. సాయంత్రం వరకు షాపింగ్ చేసుకోవచ్చు. రాత్రి 11.30గంటలకు కన్యాకుమారికి వెళ్లేందుకు కుడాల్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్తారు. ఐదోరోజు కన్యాకుమారి చేరుకొని హొటల్‌కు వెళ్తారు. ఆ తర్వాత రాక్ మెమోరియల్, గాంధీ మండపం, సన్‌సెట్ పాయింట్‌ని సందర్శిస్తారు. రాత్రికి కన్యాకుమారిలోనే బస ఉంటుంది. ఆరో రోజు కన్యాకుమారి నుంచి కొచ్వెల్లి చేరుకొని త్రివేంద్రం చేరుకొని అనంత పద్మనాభ స్వామి దర్శనానికి వెళ్తారు. ఆ తర్వాత కొచ్వెల్లికి చేరుకొని తిరుచిరాపల్లికి వెళ్తారు. ఏడో రోజు శ్రీరంగం చేరుకొని ఆలయానికి వెళ్తారు. లంచ్ చేసుకొని 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న తంజావూరుకి వెళ్తారు. అక్కడ బృహదీశ్వర ఆలయాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత తిరుగు ప్రయాణమవుతారు. ఎనిమిదో రోజు ఉదయం 8 గంటలకు రేణికుంట చేరుతారు. తొమ్మిదో రోజు వేకువ జామున 2.30గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది.

### మూడు కేటగిరిలు.. ప్యాకేజీ ధరలు ఇవే..

ఈ కార్తీక మాసం స్పెషల్ టూర్ ప్యాకేజీని మూడు కేటగిరిల్లో ఐఆర్‌సీటీసీ అందిస్తున్నది. స్లీపర్, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కేటగిరిలో అందుబాటులో ఉన్నాయి. స్లీపర్ కేటగిరికి రూ.14,250, థర్డ్ ఏసీకి రూ.21,900, సెకండ్ ఏసీకి రూ.28,450 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకేజీలో రైలు టికెట్, హొటల్‌లో బస, బస్సు సౌకర్యం ఉంటుంది. అలాగే మార్నింగ్ టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ కవర్ అవుతాయి. ఇక పర్యాటకులందరికీ ఇన్సురెన్స్ ఉంటుంది. స్లీపర్ కేటగిరిలోని పర్యాటకులకు నాన్ ఏసీ గదుల్లో వసతి ఉంటుంది. అలాగే, నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది. థర్డ్ ఏసీలోని వారికి ఏసీ గదుల్లో వసతి, నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం కల్పిస్తారు. కంఫర్ట్ కేటగిరిలోని అందరికీ ఏసీ గదుల్లో వసతి, ఏసీ వాహనంలో ప్రయాణం కల్పిస్తారు. ప్యాకేజీలో బుక్ చేసుకునేందుకు %ఆతీష్మీశీబతీఅం.ఎశీఎ% వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ కోరింది. లేకపోతే సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలోని రైల్వేస్టేషన్లలోని కార్యాలయాల్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com